ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025 | 8 పేజీలు





ప్రకాశం | బాపట్ల

6935.36 హెక్టార్లలో

పంటలు నీటి పాలు

▶ 8లో

పోలియోను అంతం చేద్దాం..

▶ 8లో

మెడికల్ కాలేజీల

ప్రైవేటీకరణ యత్నాలపై వైసిపి ఆగ్రహం

▶ 5లో



కొల్లూరులో చెరువులను తలపిస్తున్న మాగాణి పొలాలు



దొర్నాలలో నీటమునిగిన మిర్చి పంట

ముంచుతున్న వర్షం




కొనకనమిట్లలో కోతకు గురైన ఆర్అండ్‌బి రోడ్డు

- వరి, మినుము, శనగ, పూల తోటలు, కూరగాయల పంటలకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు
- పొంగుతున్న వాగులు
- ప్రకాశం, బాపట్లలో ఆగని వర్షాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, ఒంగోలు బ్యూరో

బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణితో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీడని వర్షాలతో పంటలన్నీ మునుగుతున్నాయి. వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల వ్యవసాయ డివిజన్లలో ఖరీఫ్‌లో సాగయ్యే వరిపైరుకు నష్టం వాటిల్లుతుంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వరితో పాటు మినుము, శనగ, పత్తి, సజ్జ, కూరగాయల పంటలు, పూలతోటల్లో వర్షపు నీరు చేరింది. వాగులు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

బాపట్ల జిల్లాలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో వ్యవసాయ బోర్లు, కొమ్మమూరు కాలువ కింద ఖరీఫ్ ప్రారంభం లోనూ వరి సాగు చేస్తారు. ప్రస్తుతం కొంత మేర వరి పైరు 10 రోజుల్లో ▶ 2లో



ఉధృతంగా నెమలిగుండ్ల జలపాతం

కొత్తపేట ఎన్నికలపై

హైకోర్టు స్టే

- పంచాయతీ కార్యాలయం వద్ద హై టెన్షన్
- ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో అర్ధాంతరంగా ఆగిన ఎన్నికలు
- మరలా ఉత్తర్వులు వచ్చేంత వరకు ఎన్నికలు నిర్వహించవద్దని ఆదేశాలు జారీ
- నామినేషన్ వేసేందుకు వచ్చిన మాజీ సర్పంచ్ వాసు
- నామినేషన్ పత్రాలు తీసుకోవాలంటూ బైఠాయింపు



పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించిన మాజీ సర్పంచ్ వాసు

ప్రజాశక్తి-చీరాల

కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం హై టెన్షన్ వాతావరణ నెలకొంది. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల తేదీ ఖరారు చేసినప్పటి నుండి రోజుకో మలుపు తిరుగుతూ ఆ పంచాయతీ ఎన్నికలు చర్చనీయాంశమయ్యాయి. గురువారం పంచాయతీ ఎన్నికల వ్యవహారంపై ఓటర్ల జాబితాలో పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెల్లప్రోలు నాగేశ్వరరావు హైకోర్టులో రిట్టు పిటిషన్ దాఖలు చేయటంతో కోర్టు పిటిషన్‌ను స్వీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నాడు బెంచ్ పైకి వెళ్లిన కొత్తపేట పంచాయతీ ఎన్నికల రిట్ పిటిషన్ ఫైల్ ను పరిశీలించిన కోర్టు తదుపరి ఉత్తర్వులు ▶ 2లో

ప్రైవేటు బస్సుల్లో.. భద్రతేదీ.?



- ప్రజల్లో ఆందోళన కలిగించిన కర్నూలు బస్సు ప్రమాదం
- ఇంకొల్లుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గన్నపనేని ధాత్రి సజీవదహనం
- ఈ బస్సు ఒంగోలుకు చెందిన వేమూరి ట్రావెల్స్ వారిదే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణం భద్రత ప్రశ్నార్థకమైంది. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని కోరుతున్నా కొందరు ప్రయాణాలకు ప్రైవేటు బస్సులను ఎంచుకుంటున్నారు. ఇదే వారి పాలిట మృత్యువుగా మారుతోంది. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బెంగుళూరు, చెన్నయ్, హైదరాబాద్ వంటి పట్టణాలకు ప్రైవేటు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటారు. కనీసం డిపోలు కూడా ఉండవు. రోడ్డు కూడళ్లలో గంటలకొద్దీ వేచి ఉండి ప్రయాణాలు సాగిస్తున్నారు. నిబంధనలు ఏమీ ఉండవు. అదే ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. భద్రత కూడా.. పరిమితంగా ఉండే వేగంతో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లారుజామున జరిగిన బస్సు ప్రమాదం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులో ఇంకొల్లు మండలం, పూసపాడుకు చెందిన గన్నపనేని దాత్రి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కూడా సజీవ దహనమయ్యారు.



ధాత్రి (ఫైల్)

ప్రమాదానికి గురైన బస్సు ఒంగోలుకు చెందిన వేమూరి ట్రావెల్స్‌కు చెందినది. దీని యజమానులకు పెద్ద సంఖ్యలో బస్సులున్నాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పెద్దపెద్ద నగరాలకు బస్సులను నడుపుతున్నారు. ఆర్టీసీలో ప్రైవేటీకరణ చర్యలు మొదలయ్యాక గడిచిన పదేళ్లలో ప్రైవేటు రవాణా వ్యవస్థ సమాంతరంగా పెరిగింది. ప్రైవేటు బస్సులు పెద్దఎత్తున పెరిగాయి. జిల్లాలోనే పలు ట్రావెల్స్ బస్సులను నడుపుతున్నాయి. వేమూరి, కావేరీ, శ్రీకృష్ణ, తులసీ, వినాయక తదితర సంస్థలు జిల్లాలో ఉన్నాయి. ఇవన్నీ 200కు పైగా బస్సులను కలిగి ఉన్నాయి. వీటితో పాటు పలు ఆరెంజ్ వంటి సంస్థలు కూడా బయట నుంచి వస్తున్నాయి. రోజూ జిల్లా నుంచే వివిధ సంస్థల బస్సులు 400కు పైగా సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లే బస్సులు అనేకం ఉన్నాయి. అక్కడ నుంచీ ఒంగోలు వరకూ ప్రయాణికులను ఎక్కించుకుంటూనే ఉంటాయి. సమయం ఉండదు. అందుకే వేగంగా వస్తుంటాయి. వంద నుంచి 120 కిలోమీటర్ల వేగంతో పోతుంటాయి. వాస్తవానికి జాతీయ రహదారి వేగం పరిమితం 100 కిలోమీటర్లు మాత్రమే. అంతకు మించిపోవడానికి వీల్లేదు. అతివేగంగా వెళ్లడంతో గతంలోనూ ప్రైవేటు బస్సులు అనేక ప్రమాదాలకు గురయ్యాయి. దగ్ధాలు జరిగాయి. ఇవన్నీ సరైన భద్రతా చర్యలు పాటించనందునే.. అనుమతులు అన్నీ కాగితాలపైనే ఉంటాయి. బస్సుల ఫిట్‌నెస్ ▶ 2లో

కొత్తపేట ఎన్నికలపై హైకోర్టు స్టే

(మొదటిపేజీ తరువాయి)

వెలువడేంతవరకు ఎన్నికలును తక్షణమే నిలుపుదల చేయాలని ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కొత్తపేట పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి.

ఎన్నికలపై కోర్టు స్టే ఇచ్చిందని సోషల్ మీడియాలో సమాచారం వైరల్ కావడంతో అధికారులలో, అభ్యర్థులలో, ఆ పంచాయతీ ఓటర్లలో మరింత ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో కోర్టు స్టే ఇచ్చినట్లు ఆర్డర్ కాపీ మాత్రం బయటికి రాకపోవడంతో కొత్తపేట మాజీ సర్పంచి చుండూరు వాసు తన నామినేషన్ పత్రాలను అధికారులకు ఇచ్చేందుకు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అక్కడ పంచాయతీలో ఏఆర్‌ఓగా ఉన్న నారాయణ నామినేషన్ పత్రాలను స్వీకరించేందుకు నిరాకరించటంతో మాజీ సర్పంచ్ వాసు నిరసన వ్యక్తం చేస్తూ.. అధికారులతో వాగ్వాదానికి దిగారు. కోర్టు స్టే సమాచారం తనకు తెలియదని నామినేషన్ వేసేందుకు పంచాయతీకి వచ్చానని తన నామినేషన్ స్వీకరించాల్సిందే అంటూ అధికారులతో వాదనకు దిగారు. ఓ సందర్భంలో వేడుకున్నారు. అయితే కోర్టు ఆర్డర్ కాపీ అధికారులకు చేరేందుకు సుమారు గంట సమయం పట్టడంతో 'కోర్టు ఆర్డర్ కాపీ చూపిస్తారా.. లేక నా నామినేషన్ స్వీకరిస్తారా.. ఏదో అధికారులు తేల్చి చెప్పాలి' అంటూ కార్యాలయం ముందు బైఠాయించి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ సిఐ నాగభూషణం శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. నిరసన విరమించమని పోలీసులు సూచించినప్పటికీ తన న్యాయమైన అప్పీలును అధికారులు స్వీకరించాలని నామినేషన్ పత్రాలు తీసుకోకుంటే కోర్టుకు వెళతానని న్యాయపోరాటం చేస్తానని అధికారులపై మండిపడ్డారు. మాజీ సర్పంచ్ వాసుతో పాటుగా మరో దళిత అభ్యర్థి కూడా తన నామినేషన్ స్వీకరించాలని కార్యాలయం ముందే బైఠాయించి కూర్చొన్నారు. దీంతో కొత్తపేట పంచాయతీ వద్ద సుమారు గంటకు పైగా హై టెన్షన్ వాతావరణం కనిపించింది. విషయం తెలుసుకున్న జిల్లా ఎన్నికల సహాయక అధికారి మెడబలిమి రాజేష్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు ఎలక్షన్ కమిషన్ తక్షణమే ఎన్నికలు నిలిపివేయాలి స్పష్టంగా తమకు ఆదేశాలు ఇచ్చిందని, కాబట్టి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఎన్నికలు నిర్వహించేది లేదని సూటిగా చెప్పారు. కొంత సమయం తీసుకున్న అధికారులు ఎట్టకేలకు మధ్యాహ్నం 3:40 నిమిషాలకు ఆర్డర్ కాపీను ప్రింట్ తీసి వాసుకి మీడియాకు ఇచ్చారు. ఆ వెంటనే నామినేషన్ గదికి సిబ్బంది తాళాలు వేశారు.

జిల్లా ఎన్నికల సహాయక అధికారి రాజేష్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను పాటించామని, అందులో భాగంగానే తక్షణమే ఎన్నికలను నిలుపుదల చేశామన్నారు. ఎలక్షన్ కమిషన్ తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు కొత్తపేట పంచాయతీ ఎన్నికలను ప్రస్తుతం నిలిపివేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

న్యాయపోరాటం చేస్తా..
మాజీ సర్పంచ్ చుండూరి వాసు

నామినేషన్ వేసేందుకు తనతో పాటు దళిత అభ్యర్థి కూడా పంచాయతీ కార్యాలయానికి వస్తే నామినేషన్ పత్రాలను అధికారులు స్వీకరించకుండా కోర్టు ఆర్డర్ కాపీ చూపించకుండా కాలయాపన చేసి ఉద్దేశపూర్వకంగానే నామినేషన్లను స్వీకరించలేదని కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు మీడియాతో మాట్లాడారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన సమయానికి అధికారులకు ఆర్డర్ కాపీ వచ్చే సమయానికి మధ్య చాలా వ్యత్యాసం నామినేషన్ వేసేందుకు వచ్చిన సమయానికి అధికారులకు ఆర్డర్ కాపీ వచ్చే సమయానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందని అయినప్పటికీ మా వద్ద నామినేషన్లు అధికారులు తీసుకోలేదని అన్నారు. న్యాయం జరిగేంతవరకు తన పోరాటం ఆగదన్నారు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటం చేస్తూ మరలా కోర్టుని ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు.

ముంచుతున్న వర్షం

(మొదటిపేజీ తరువాయి)

కోతకు వచ్చే దశలో ఉండగా.. మరికొంత పైరు కంకి, పాలు పోసుకునే దశలో ఉంది. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వేమూరు, కొల్లూరు మండలాల్లో వరి పొలాల్లో వరద నీరు చేరి పైర్లు నీటిలో ఉండిపోయాయి. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో తమ వరి పైరును ఎలా కాపాడుకోవాలో అర్థం కాని దైన్యస్థితిలో రైతులున్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో సాగు చేసే కంద, పసుపు, అరటి తోటలు చాలా రోజులుగా నీటిలో ఉన్నాయి. వర్షాలు ఇలానే కొనసాగితే ఈ పంట ఉరకెత్తే పరిస్థితి ఉంది. అలాగే బాపట్ల ప్రాంతంలో పూలతోటలు, కూరగాయల సాగు అత్యధికంగా ఉంది. ఇవి కూడా ఉరకెత్తే పరిస్థితి ఉంది. జిల్లాలోని చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో మెట్ట భూముల్లో రైతులు సాగు చేసిన శనగ, పత్తి, మినుము, మిరప పంటల కూడా దెబ్బతిన్నాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పైర్లు నీట మునిగాయి. ఈ వర్షానికి పూత రాలడం, కాయలు నల్లగా మారుతున్నాయి. జిల్లాలో అధికభాగం పత్తి పంట అద్దంకి, మార్టూరు, యద్దనపూడి, సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో సాగుచేశారు. వర్షాలకు పత్తి కాయలు పగిలి పత్తి బయటకు తీసే సమయంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో నష్టం వాటిల్లుతుంది. పగిలిన పత్తి నల్లగా మారడం, గింజలోకి నీరు పోసుకోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తింది.

ప్రైవేటు బస్సుల్లో భద్రతేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

ఎంత మేరకు సక్రమంగా ఉందన్నదే ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారులకూ చెందాల్సినవి నెలనెలా ఉంటాయి. దీంతో నామమాత్రపు తనిఖీలు చేస్తుంటారు. పైగా బస్సుల నిర్వాహకులు అన్ని రకాలుగా రాజకీయ పలుకుబడి కలిగి ఉంటారు. దీంతో అధికారులు కూడా ఆ బస్సులను పట్టుకోవడానికి, తనిఖీలు చేయడానికి కూడా వెనుకాడతారు. ఇవే ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. పైగా ఎక్కడో రిజిస్ట్రేషన్లు చేస్తారు. తాజాగా ప్రమాదానికి గురైన బస్సు యజమాని ఒంగోలుకు చెందిన వ్యక్తి. ఈ బస్సును డయ్యూడామన్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత ఒడిసాలో రిజిస్ట్రేషన్ చేయించారు. పైగా టూరిస్టు అనుమతి ఉంది. అన్ని అనుమతులు కాగితాలపై క్లియర్‌గానే ఉన్నాయంటున్నారు. ఇంత ఘోర ప్రమాదం ఎలా జరిగిందనేదే ఆందోళన కలిగిస్తోంది. జిల్లా నుంచీ హైదరాబాదు, బెంగుళూరు, చెన్నయ్, విశాఖపట్నం వంటి పట్టణాలకు నిత్యం 200కు పైగా ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. ఎప్పుడు వస్తుందో తెలియదు. ఇపుడు ఏసీ, పడక సౌకర్యం ఉండే బస్సులూ పెరిగాయి. ప్రమాదాలు జరిగితే క్షణాల్లోనే బస్సంతా కాలి బూడిదవుతోంది. అద్దాల నుంచి బయటపడే మార్గం కూడా కనిపించడం లేదు. కొత్తగా వస్తున్న వోల్వో కంపెనీ బస్సులు రోడ్డు క్లియరెన్సు చాలా తక్కువగా ఉంటోంది. చిన్న రాయి తగిలినా ఇంజను తగలడం, ఆయిల్ ట్యాంకు పగలడం వంటివి జరుగుతున్నాయి. రోడ్లలో ఉండే స్పీడు బ్రేకర్లకూ తగులుతూ పోతుంటాయి. ఇవన్నీ నిర్మాణ లోపాలుగానే భావించాలి. రోడ్లకు తగ్గట్టుగా వాహనాలు ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించాలి. భద్రత లేని బస్సుల్లో ప్రయాణం ప్రాణాలకే ప్రమాదంగా గుర్తించాలి. ఇక ఎక్కడ ప్రమాదం జరిగినా బస్సుల తనిఖీ సహజం. ఇక్కడ రొటీన్‌గా కూడా మొదలైంది.

జడ్‌పి 'బాలికల' సత్తా

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలు గుంటూరులో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి శ్రీదేవి శుక్రవారం తెలిపారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు పాల్గొన్నారు. శంకరి శ్రీ, ఫర్హాన, నందిని, శ్వేతారెడ్డి పాల్గొన్నారు. బృంద గాన విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎం వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన సంగీత ఉపాధ్యాయుడు డి మస్తాన్‌వలిని ప్రత్యేకంగా అభినందించారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పొదిలి

డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ కోరారు. పొదిలి మండలం వెలుగు- డిఆర్‌డిఏ కార్యాలయంలో గ్రామ సంఘం అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెలుగు డిఆర్‌డిఏ కార్యక్రమాలపై సమీక్షించారు. ముఖ్యంగా స్త్రీనిధిలో ప్రాజెక్ట్ కార్యక్రమాలు పారదర్శకంగా జరగడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్త్రీనిధి నుంచి గ్రామ సంఘ అసిస్టెంట్లకు బయోమెట్రిక్ డివైస్‌లను అందించారు. ఏపిఎం గోపాలకృష్ణ, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎలొసి నాగభూషణం, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నీసా, సీసీలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, పరిష్కార మార్గాలపై కలెక్టర్‌తో చర్చించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు కలెక్టర్ పి రాజాబాబు కూడా నియోజకవర్గ అభివృద్ధికి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తుఫాను ప్రభావంతో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి మొదలైన వర్షం శుక్రవారం ఉదయం వరకు వర్షం దంచి కొట్టింది. శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో 15 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదయింది. వర్షపు నీటితో పొలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. ఆర్‌టిసి బస్టాండ్‌లోని వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీస్‌స్టేషను లోకి కూడా వర్షపు నీరు చేరింది. కనుమళ్ల రోడ్డులోని చెంచుల కాలనీ లోకి నీరు చేరింది. తహశీల్దారు రాజేష్ పంచాయతీ కార్యదర్శి ఎస్‌జి జగదీష్ ఆధ్వర్యంలో జెసిబి తో కాలువలు చేయించి వర్షపు నీటిని బయటకు పంపారు. సోమరాజు పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమల పట్టాభి నగర్, అప్పాపురం ప్రాంతాల్లో జడ్‌పి సిఇఒ, మండల ప్రత్యేక అధికారి చిరంజీవి పర్యటించారు. పాలేరు బిట్రగుంట ఛానల్ ఉదతంగా ప్రవహిస్తుంది. దీంతో కే.బిట్రగుంట, కలికివాయి, సోమరాజుపల్లి, పాకల ఊళ్ల పాలెం, బింగినపల్లి చెరువుల్లోకి నీరు చేరింది.


కొనకనమిట్లలో ఉరకెత్తిన పొగాకు పంట

కొనకనమిట్ల : అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని వంట పొలాల్లో వర్షపు నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. గనివానిపాడు, గొట్లగట్టు, నాయుడుపేట, కాట్రగుంట, పెదారికట్ల, కొనకనమిట్ల గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలలో సాగు చేసిన కంది, పత్తి, బర్లీ పొగాకు పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరి దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పేరారెడ్డిపల్లె వాగు పొంగి ప్రవహించింది. రోడ్డుపై నుంచి వాగు ప్రవహించడంతో కొద్ది పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. కాట్రగుంట సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కుంట వర్షానికి నిండిపోయింది.

కొండపి: మండలంలో 126.4 మిల్లీమీటర్ల వర్షపాతం


కొండపిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యలవాగు


శింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లోకి చేరిన వర్షపు నీరు

నమోదైనట్లు తహశీల్దారు శీలం శ్రీనివాసరావు తెలిపారు. అట్లేరు,పెరిదేపి వాగులను పరిశీలించి ముళ్లకంచ వేసి రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు. వర్షం కారణంగా వాగులు ఉప్పొంగాయి .కొండపి అనకర్లపూడి మధ్యలోని అట్లేరు వాగు,అనకర్లపూడి మద్దులూరు మధ్యలోని ముసివాగు తీవ్ర రూపం దాల్చాయి. అట్లేరు దాదాపు నాలుగు అడుగుల మేర ప్రవహించింది. కె.ఉప్పలపాడు, టంగుటూరు మండలం యం.నిడమనూరు గ్రామాల మధ్య ఉన్న ముసి వాగు కూడా ఉప్పొంగాయి. చిన్న కండ్లగుంట,తాటాకులపాలెం మధ్య ఉన్న కొయ్యల వాగు తీవ్ర రూపం దాల్చింది. పెరిదేపి గ్రామ ప్రారంభంలోనున్న వాగు రోడ్డుమీద మోకాళ్ళ లోతు పై పారడంతో రాకపోకలను నిలిపివేశారు.

నేలకొరిగిన భారీ వృక్షం

వర్షం కారణంగా మండల పరిధిలోని మిట్టపాలెంలో భారీ వృక్షం నేలకొరిగింది. టంగుటూరు కొండపి ప్రధాన రహదారి కావడంతో రోడ్డుపై చెట్టు అడ్డంగా పడడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయిు పోలీస్ సిబ్బంది జెసిబి సహకారంతో రోడ్డు కు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

తడిసిన పొగాకు బేళ్లు

కట్టవారిపాలెం నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు వేలం కోసం పొగాకు బేళ్లను వేలం కేంద్రంలో ఉంచారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కిటికీలో నుంచి జల్లులు పడడం, రేకుల నుంచి వర్షపు నీరు పడతంతో అవి తడిచాయి. తడచిన బేళ్లకు నష్టపరిహారాన్ని అందించాలని రైతులు కోరారు.

మద్దిపాడు : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లోని వాగులు ప్రవహిస్తున్నారు.పెద్దపల్లి వద్ద ఉన్న వాగుపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలను నిలిపివేశారు. సీతారాంపురం కోష్టాలు సెంటర్ నుంచి గురువారెడ్డి పాలెం వెళ్లే దారిలోను,


పిసిపల్లిలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు


పాకల గ్రామంలో చెరువును తలపిస్తున్న పొలాలు

నేలటూరి గ్రామానికి ముఖద్వారాన ఉన్న వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తకోట వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎస్ఐ వెంకట సూర్య ఆధ్వర్యంలో వాగులు వద్ద ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు చేపట్టారు.


కొండపిలో రహదారిపై విరిగి పడిన భారీ వృక్షం

ఏడుగుండ్లపాడు గ్రామంలో వర్షపు నీరు నిలవకుండా ఉండే విధంగా చర్యలను ఆ గ్రామ సర్పంచి శిల్పా సౌందర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పనులను తహశీల్దారు ఆదిలక్ష్మి పర్యవేక్షించారు.

పిసిపల్లి :తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని వెంగళాపురం దళిత కాలనీలో ఇళ్లలోనికి నీరు చేరాయి. ఈ విషయం గురించి తెలుసుకున్న ఎంపిడిఒ శుక్రవారం కాలనీకి వెళ్లి పరిస్థితి పరిశీలించారు. స్పందించి నీటిని బయటకు పంపేందుకు జెసిబి ద్వారా రోడ్డు కిరువైపులా కాలువలు తీయించే పనులు చేపట్టారు.


టంగుటూరు మండలంలో కృంగిన చప్టా

కుంగిన చప్టా

టంగుటూరు :తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండల పరిధిలోని కొణిజేడు-మర్లపాడు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బి రోడ్డుపై బ్రిడ్జి కుంగింది. దీంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాల కాణంగా కొణిజేడు చెరువు అలుగు ఉధృతంగా పారడంతో ఆర్‌అండ్‌బి రోడ్డుపై బ్రిడ్జి కుంగింది. ఈ విషయం గురించి తెలుసుకున్న ఆర్‌అండ్‌బి ఇఇ గోపీనాథ్, ఎఇ నాగార్జున, డిఇఇ షేక్ జాన్ వలి కుంగిన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొణిజేడు గ్రామ టిడిపి నాయకుడు రామాగోపి పాల్గొన్నారు.

టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామం చుట్టూ ఉన్న చప్టాలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు జి. ఆంజనేయులు మాట్లాడుతూ పునరావస కేంద్రంలోని బాధితులకు అన్ని సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పునరావాస కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, డిపిఒ వెంకటేశ్వరరావు,తహశీల్దారు ఆంజనేయులు పరిశీలించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ వాణిశ్రీ పొంగిన వాగులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ సునీల్, సిసి మోహనరావు, ఎంపిహెచ్ఒ శ్రీను, మలేరియా శాఖ అధికారి సురేష్, టిడిపి గ్రామ అధ్యక్షుడు నార్ని మోహన్ రావు, నార్ని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోతకు గురైన ఆర్‌అండ్‌బి రహదారులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆర్‌అండ్‌బి, మట్టి రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. వాగుమడుగు, గనివెనపాడు ఆర్‌అండ్‌బి రోడ్డు, గొట్లగట్టు నాయుడుపేట, పెదారికట్ల- ఇరుసలగుండం, మునగపాడు- ముమ్మాయపాలెం, చౌటపల్లి- పాతపాడు ఆర్‌అండ బి రోడ్లు వర్షాలకు కోతకు గురయ్యారు. రహదారిపై గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. వాగుమడుగు, గనివెనపాడు మధ్యలోని నేల చప్టా పూర్తిగా కోతకు గురికావటంతో వాగుమడుగు, గనివెనపాడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలమయ్యాయి.ఇళ్లల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు మాగానిలా తలపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులు తక్షణమే


కొనకొనమిట్ల మండలంలో కోతకు గురైన ఆర్‌అండ్‌బి రహదారి

స్పందించి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-దొనకొండ

గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో ఓ పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని పోలేపల్లి ఎస్‌సికాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన మురికిపూడి బాలమరియమ్మ గ్యాస్ పోయ్యిపై వంట చేసుకొని బయటకు వచ్చి కూర్చుంది. కొద్దిసేపటికి గ్యాస్ లీకై సిలిండర్ పేలి పెద్దఎత్తున మంటలు వచ్చాయి. మంటలు పెద్దఎత్తున చెలరేగడంతో ఇంట్లోని నగదు, సామగ్రి అగ్నికి బూడిదయ్యాయి. తన కుమారుడి వివాహం నిమిత్తం సమకూర్చుకున్న రూ.6లక్షల నగదు, ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. తహశీల్దారు రమాదేవి, విఆర్ఒ కాశయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో రూ.7.95 లక్షలు నష్టం జరిగినట్లు అంచనాలు వేశారు. ఎస్ఐ త్యాగరాజు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సంతపేటలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి గుడి వీధిలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ రేకులు ఇల్లు దగ్ధమైది. అయింది. ప్రాణ నష్టం జరగలేదు. స్థానికుల కథనం ప్రకారం... నాగులుప్పలపాడు మండలం వినోదరాయుని పాలెంకు చెందిన శారద టైలరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. తన అన్నతో కలిసి ఒంగోలులో నివసిస్తుంది. తెల్లవారు జామున ఇంట్లోని మంటలు రావడాన్ని ఇరుగుపొరుగు వారు గుర్తించి కేకలు వేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అన్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అన్ని ప్రమాదంలో 10 వడ్ల బస్తాలు, రెండు డబుల్ కాట్ మంచాలు, రెండు ఫ్రిజ్‌లు, రెండు కూలర్లు, చెక్క బీరువా, ఇనప బీరువా, రెండు టీవీలు, దుస్తులు కాలిబూడిదయ్యాయి.

అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

భారీ వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని చదలవాడ రామన్న చెరువు, నాగులుప్పలపాడు ,గ్రోత్ సెంటరు మధ్య ఉన్న హనుమాపురం, కొత్తకోట వాగులను శుక్రవారం పరిశీలించారు.రామన్న చెరువ వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిఎస్‌పి వెంట ఎస్ఐ రజియా సుల్తానా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'నెప్పల' దంపతులకు అభినందనలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మద్దిరాలపాడు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రవాస భారతీయుడు నెప్పల సుబ్బారాయుడు. శారద దంపతులు తెలిపారు స్వగ్రామమైన మద్దిరాలపాడుకు వచ్చిన నెప్పల సుబ్బారాయుడు. శారద దంపతులనుకాలనీ వాసులు కలిసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పుటూరి రాజశేఖర్, ఎర్రమల నాగేశ్వరావు, బరకం వెంకటేశ్వర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గిరిజనులకు భోజన వసతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దోలబాలవీరాంజనేయస్వామి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్కెటింగ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతంలోని టిపి.నగర్, అప్పాపురం వాసులు శుక్రవారం భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రాజేష్, ఎంపిడిఒ డి.జయమణి, ఏపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, టిడిపి మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి కూనపరెడ్డి సుబ్బారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్.ఎస్‌దాని, సోమరాజుపల్లి గ్రామ అధ్యక్షులు శీలం సుబ్రహ్మణ్యం, పిబి.ఛానల్ వైస్ చైర్మన్ నార్రరాంబాబు పాల్గొన్నారు.


అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఈశ్వర్‌రెడ్డి

అథ్లెటిక్స్‌లో ఢిల్లీ స్కూల్ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె యస్వంత్ ఈశ్వర్ రెడ్డి ఎస్‌జిఎఫ్‌ఐ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించాడు. ఏలూరులో జరిగిన రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అండర్ 19 విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి 400 మీటర్ల హర్డిల్స్ స్వర్ణ పతకం సాధించాడు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈశ్వర్‌రెడ్డి తన ప్రతిభ, కఠిన సాధన, అంకిత భావంతో పోటీదారులను వెనక్కి నెట్టి మొదటి స్థానంలో నిలిచాడు. బంగారు పతకం సాధించిన ఈశ్వర్‌రెడ్డిని ఐడిపి ఎస్ స్కూల్ గ్రూప్స్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పైనం సాయిరంగారెడ్డి, ప్రిన్సిపల్ కె సుభాష్ చంద్రబోస్, ఎ.ఒ కర్రి శివప్రసాద్ అభినందనలు తెలిపారు.


రైతులకు కిసాన్ డ్రోన్లు అందజేస్తున్న ఆనందబాబు

రైతులకు డ్రోన్ అందజేత

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని పెరవలిపాలెంకు చెందిన శ్రీ బాలా త్రిపురసుందరమ్మ తల్లి సిహెచ్‌సి కిసాన్ డ్రోన్ గ్రూప్ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన కిసాన్ డ్రోన్‌ను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. కిషి 3 ప్రొడోన్ మోడల్ కలిగిన డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డ్రోన్లను అందజేశారు. రూ.9.80 లక్షల విలువైనది కాగా ప్రభుత్వం రూ.7.84 సబ్సిడీ అందించింది. లబ్ధిదారుల వాటా క్రింద రూ.1.96లక్షలు చెల్లించటంతో డ్రోన్ మంజూరైనట్లు ఎఒ ప్రేమ్ సాగర్ తెలిపారు. ఈ గ్రూపులో చనాకుల పాములు, చవాకుల భూషయ్య, చవాకుల సాయి కృష్ణ, బోడపాటి పవన్ కుమార్, దాసరి నాంచారయ్య ఉన్నట్లు తెలిపారు.


డివైడర్ల ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న ఆవులు

గోవులకు నివాసాలుగా డివైడర్లు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణం ప్రధాన రహదారుల్లో గోవుల సంచారం అధికమైంది. యజమానులు గోవుల సంరక్షణ బాధ్యతను గాలికి వదిలేశారు. గోవులకు రహదారుల డివైడర్లే నివాసాలుగా మారాయి. మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రజలకు విమర్శిస్తున్నారు. గతంలో ప్రధాన రహదారుల్లో గోవుల సంచారం వల్ల అనేక ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. గోవులను 4వ వార్డులోని హిందూ స్మశాన వాటిక కు తరలించారు. అక్కడి నుండి గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ప్రకటన చేశారు. పట్టణంలో నివాస ప్రాంతాల్లో కోతుల బెడద, రహదారులపై ఆవులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్దాం అనుకుంటే వినే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోవులను ఇతర ప్రాంతాలకు తరలించి రహదారులపై ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నష్ట పరిహారం అంచనాలు వేయాలి

ప్రజాశక్తి - మార్టూరు

మండలంలోని బొల్లాపల్లిలో ఖరీఫ్లో 800 ఎకరాలు మినుము సాగు చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిన్నది. మినుము కోత దశకు వచ్చిన సమయంలో వర్షాలకు గింజ లేక చేతికి వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు ఎరువులు, దున్నకం, కౌలు కలిపి రూ.25 వేలు ఖర్చు పెట్టారు. 640 ఎకరాలో ఈక్రాప్ నమోదు చేశారు. 150 ఎకరాలు నమోదు చేయలేదు. నష్టపరిహారం అంచనా వేయాలని రైతులు కోరారు.

మార్టూరు రూరల్ : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని ద్రోణాదుల, బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాల్లో 1200 ఎకరాల్లో రైతులు పండించిన మినుము పంట నీట మునిగిపోవడంతో పరిశీలించారు. కోత కోసే దశలో పంట నష్టపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమగ్ర పరిశీలించి పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రైతు సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం 125 మంది లబ్ధిదారులకు రూ.75 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు.

ఇంకొల్లు : మండలంలోని ఇసుక దర్శిలోని క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 27మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు మంజూరైన వైద్య సహాయం రూ.12,75,529 విలువైన చెక్కులు అందజేశారు. పర్చూరు ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు పాల్గొన్నారు.

పర్చూరు : ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.16,07,690 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలానికి చెందిన 11మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.8,43,699 చెక్కులను శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. అనారోగ్యంతో ఉన్న పేదలకు ఉపయోగం అన్నారు.

అమృతలూరు : మండలంలోని ఇంటూరుకు చెందిన కట్టుపల్లి ఎలిమ్మ, కొల్లూరు మండలం పెసర్లంకకు చెందిన కూరేటి శివపార్వతి అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో పొందుతున్నారు. ఆమె వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి విడుదలైన రూ.3.75 లక్షలు చెక్కును శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు.


సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

నాగండ్ల, పావులూరు రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - ఇంకొల్లు

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు మండలంలోని నాగండ్ల, పావులూరు రోడ్డు అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ రోడ్డు జడ్పీ పరిధిలో ఉండటంతో అభివృద్ధి పనులు చేయాల్సినప్పుడు జాప్యం జరుగుతుందని తెలిపారు. పిఆర్ నిధులతో ప్రస్తుతం రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలిపారు. ఇంకొల్లు నుంచి కోళ్లపూడి మీదుగా మార్టూరు హైవేకు పోవటానికి ఎంతో అనువుగా ఉంటుందని అన్నారు. మార్టూరు మండలంలోని గ్రామాల్లో కొండల నుంచి గ్రావెల్, డస్ట్ కసల నుంచి చిప్స్, ముక్క, కొండ రాళ్ళు నిత్యం ఈ రోడ్డునే ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాంకు రవాణా అవుతుంటాయని అన్నారు. నిత్యం వివిధ టిప్పర్లు వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు పటిష్ఠంగా నిర్మించాలని సంబంధిత గుతేదారులకు సూచించారు. నక్కలపాలెం, పావులూరు, చిన్నక్కలపాలెం గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో పర్చూరు ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, టిడిపి అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, నాగండ్ల, నక్కలపాలెం, పావులూరు నాయకులు ఉన్నారు.


నాగండ్ల రోడ్డు పనులు పరిశీలిస్తున్న శాసనసభ్యులు

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు

మండలంలోని చిమ్మిరిబండ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యత, ఆత్మవిశ్వాసం పెంపుదల, ఒత్తిడిని ఎదుర్కోవటం, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగటం వంటి అంశాలపై కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎస్ ప్యారి జాన్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కందిమల్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెల్త్ కౌన్సిలర్ ఎస్ ప్యారిజాన్

అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపిక

ప్రజాశక్తి - కర్లపాలెం


అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపికైన శ్రీ భార్గవి సురేష్

గత 24 ఏళ్లుగా పట్టణంలోని శ్రీ భార్గవి హై స్కూల్, విద్యా సంస్థ నడుపుతున్న డైరెక్టర్ పివి సురేష్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు లభించింది. మండలం పరిసర ప్రాంత గ్రామాల్లో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ విద్యా వంతులుగా తీర్చిదిద్దడంలో 24 ఏళ్ల పాటు, విద్యా రంగంలో సుదీర్ఘంగా కృషి చేస్తూ, నిరుపేద విద్యార్థులకు అందుబాటులో కార్పొరేట్ విద్య అందించడమే కాకుండా తనవంతుగా సేవా కార్యక్రమాలు చేయడంలో భాగంగా విద్యా రంగం, సామాజిక సేవను గుర్తించి అవార్డు ఎంపిక చేశారు. కలాం జయంతి సందర్భంగా ఎఎస్‌పిఎల్ పిఠ ఆధ్వర్యంలో గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఈ నెల 26న జరిగే సభలో అవార్డు ప్రధానం చేయనున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఎంతోమంది విద్యార్థులకు విద్యనందిస్తూ, తాను చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు అధికారులు, నాయకులు సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.


ముప్పలనేని విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిఎస్‌పి

ముప్పలనేని సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - బాపట్ల

విద్యాప్రదాత, బాపట్ల ప్రాంతానికి విశిష్ట సేవలు అందించిన మాజీ శాసన సభ్యులు ముప్పలనేని శేషగిరిరావు సేవలు నేటి తరానికి ఆదర్శం కావాలని డిఎస్పి జి రామాంజనేయులు అన్నారు. ముప్పలనేని 92వ జయంతి సందర్భంగా బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలోని 'ముప్పలనేని స్మృతి వనం' వద్ద ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం బాపట్ల, సూర్యలంక మార్గంలో శేషగిరిరావు ఫిల్లింగ్ స్టేషన్లో దసరా, దీపావళి, ముప్పలనేని జయంతి సందర్భంగా వాహనదారులకు లక్కీ డిప్ ద్వారా బహుమతులు పొందిన వాహనదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, ముప్పలనేని సుమంత్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇనగంటి గాంధీ, ప్రసాద్ పాల్గొన్నారు.


వాగు పరిశీలిస్తున్న తహశీల్దారు బ్రహ్మయ్య

వాగు పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పర్చూరు

నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతామని టిడిపి నాయకులు అన్నారు. నియోజకవర్గంలోని పోలూరు, తిమ్మరాజుపాలెం, పెద్దివారిపాలెం నుంచి పర్చూరు, నాగులపాలెం మీదుగా కారంచేడు వైపుగా వెళ్లే పర్చూరు వాగు దశాబ్ద కాలం నుంచి అభివృద్ధికి నోచుకోలేదనే విషయం విధితమే. దీనిపై శుక్రవారం ప్రజాశక్తిలో వాగు ప్రవాహానికి ఆటంకంగా చిల్ల చెట్లు అనే వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దారు పి బ్రహ్మయ్య నీటిపారుదల ఎఇ ఆదిలక్ష్మి శుక్రవారం పర్చూరు వాగును పరిశీలించారు. ప్రజాశక్తితో మాట్లాడుతూ వాగు అభివృద్ధికి అంచనాలు ప్రతిపాదించి పంపించామని తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే వాగు అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ప్రస్తుతం వాగులో వరద ప్రవాహం ఎక్కువ ఉండటంతో పనులు చేపట్టడానికి ఆటంకంగా ఉందని చెప్పారు. వీరి వెంట మండల సర్వేయర్ సురేష్, విఆర్ఓ వై శ్రీనివాసరావు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు సిసిఎస్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లాలో నేర దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచేందుకు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు శుక్రవారం ఒంగోలు సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (సీసీపిఎస్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో స్టేషన్లో జరుగుతున్న పరిపాలనా, దర్యాప్తు కార్యకలాపాలు, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిసర పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట సీసీఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఎస్సై వెంకటేశ్వరరెడ్డి మరియు సిబ్బంది ఉన్నారు.



రెయిన్ కోట్లు అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర పాలక సంస్థ 4వ శానిటరీ డివిజన్ మస్టర్ పాయింట్‌ని నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నగర మేయర్ సుజాతతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ వర్కర్స్ అందరూ కూడా ప్రతిరోజూ తప్పనిసరిగా యూనిఫామ్ వేసుకొని విధులకు హాజరవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఇక నుంచి వర్షంలో కూడా తడవకుండా విధులు నిర్వహించటానికి నగరపాలక సంస్థ లో పని చేస్తున్న ప్రతి ఒక్క శానిటరీ వర్కర్స్ కోసం రెయిన్ కోట్ లు ఇస్తున్నామని తెలిపారు. నాలుగో శానిటరీ డివిజన్ వర్కర్స్‌కి రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ రమణయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, 4వ డివిడెండ్ శానిటరీ ఇన్స్పెక్టర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో డిటిసి సుశీల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఎమర్జెన్సీ అడ్జస్ట్ ఫైర్ ఎగ్జిబిషన్ లేని బస్సులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సురేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సులో తనిఖీ చేస్తున్న డిటిసి సుశీల

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



డిఎంహెచ్ఒ టి.వెంకటేశ్వర్లు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. డిఎం,హెచ్ఒ ఛాంబర్ నుంచి ఆయన శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం,హెచ్ఒ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఆశ కార్య కర్తలు, క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తీర ప్రాంతాల్లో ఉండే గర్భిణీలు, ముసలివారు, పిల్లలను పునరావాస కేంద్రాలకు పంపాలని, వారికి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. గ్రామాలలో ఆరోగ్య సిబ్బంది పర్యటించి ఆరోగ్య సమస్యలను గుర్తించాలని, మంచినీటి వనరులను కలుషితం కాకుండా చూడాలన్నారు.

మెడికల్ కాలేజీల

ప్రైవేటీకరణ యత్నాలపై వైసిపి ఆగ్రహం

- 28న జిల్లావ్యాప్తంగా ర్యాలీలు
- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ఒంగోలు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పేదల ఆరోగ్యం కోసం, వైద్య విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్న దృష్టితోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఈ ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్న అక్కసుతో పది మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే కుట్ర పన్నారని దుయ్యబట్టారు.

జగన్ హయాంలోనే ఏడు కాలేజీల నిర్మాణం పూర్తయ్యి, ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు జరిగాయని, మరో పది కాలేజీల పనులు తుది దశలో ఉన్నాయని వివరించారు. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టగానే జగన్మోహన్‌రెడ్డికి దక్కిన ఘనతను దూరం చేయాలనే అక్కసుతోనే పిపిపి పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ధ్వజమెత్తారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం రాష్ట్ర ప్రజల ఆరోగ్య హక్కుపై దాడి అని పేర్కొన్నారు. 2014 నుండి 2019 వరకు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఆంధ్రప్రదేశ్‌కు రాకపోవడం ఆయన వైద్యరంగంపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు.

ఒంగోలు లోని రిమ్స్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసినందునే పేదలకు నేడు మెరుగైన వైద్యం అందుతోందని, అదే విధంగా పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.

పది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేంతవరకు ఈ ఉద్యమం ఆగదని ప్రకటించారు. ఈ నెల 28న జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు ఈ ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 28వ తేదీ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు కేవి రమణారెడ్డి, వై.వెంకటేశ్వర రావు, బొట్ల రామారావు, కొత్తపట్నం ఎంపీపీ లంక పోతు అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మన్నె శ్రీనివాసరావు, వైవీ గౌతం అశోక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కందుకూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కలెక్టర్‌తో ఇంటూరి

కలెక్టర్ పి.రాజాబాబును కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం కలెక్టర్‌ను కలిసిన కందుకూరు ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురూ పలు విషయాలు చర్చించుకున్నారు.

జవాన్ స్థూపానికి స్థలం కేటాయింపు

మాజీ సైనికులకు కలెక్టర్ హామీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో అమర జవాన్ స్థూపానికి స్థలం కేటాయిస్తామని కలెక్టర్ పి.రాజాబాబు మాజీ సైనికులకు హామీ ఇచ్చారు. ది ప్రకాశం జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సంఘం నాయకులు కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి వారు శుక్రవారం ప్రకాశం భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాజీ సైనికులను కలెక్టర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాజీ సైనికుల యోగక్షేమాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంలో రంగరాయుడు చెరువుకు ఈశాన్యం వైపున జాతీయ జెండా పక్కన అమర జవానుల స్మారక స్థూపం నిర్మించేందుకు 100 ఇంటూ 80 అడుగుల విస్తీర్ణంలో స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వారు విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నెప్పల్లి నాగేశ్వరరావు, ఆలపాటి వెంకటేశ్వర్లు, దశరథ రామయ్య, మాజీ సైనికులు ఉన్నారు.

మునుగుతున్న పంటలు..పొంగుతున్న వాగులు..

- ఒంగోలులోనూ రెండు కాలనీల్లోకి వరదనీరు
- నిరాశ్రయులకు అన్ని సౌకర్యాలూ కల్పించండి
- అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం



దోర్నాలలో మునిగిన మిర్చి పంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, ఒంగోలు సబర్బన్

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో పంటలు నీట మునుగుతున్నాయి. ఇంకా వర్షం కొనసాగితే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రాంతంలో మిర్చి, పత్తి, మినుము పంటలు నీటమునిగాయి. పలు చోట్ల వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. కొన్ని రోడ్లు కోతకు గురవ్వగా.. మరికొన్ని చోట్ల అధ్వానంగా తయారయ్యాయి. ఒంగోలులోనూ రెండు కాలనీల్లోకి వరద నీరు చేరింది. నల్లవాగు పొంగడం వల్ల ఒంగోలు అర్బన్ మండలం, చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ, జగ్జీవన్ రావు కాలనీలకు వరద నీరు చేరింది. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆ కాలనీల్లో పర్యటించారు. అక్కడ అధికారులు చేపడుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. ఈ కాలనీలలోని సుమారు 150 ఇల్లు నీట మునగడంతో ఆ కుటుంబాలను సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీకి తరలించారు. సంయుక్త కలెక్టర్ ఆదేశాలతో వారిని సమీపంలోని నర్సింగ్ కళాశాలకు తరలించి వారికి టిఫిన్, పాలు, భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ నిరాశ్రయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ వెంట ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పి.మధుసూదన్ రావు, ఒంగోలు ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధిత ప్రాంతాల్లో పరిశీలన

నగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు నిలిచిన పలు ప్రాంతాలలో మేయర్ గంగాడ సుజాత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు పరిశీలించారు. 18వ డివిజన్ పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో ఉన్న నల్లవాగు పొంగడం వల్ల అక్కడి జగజ్జీవన్ కాలనీలోకి వరద నీరు చేరడంతో.. ఆ ప్రాంతంలో పర్యటించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. భాగ్యనగర్ రెండో లైన్‌లోని వరద బాధితుల పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను కమిషనర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఇస్సియ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ



జగజ్జీవన్ కాలనీలో పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న



పునరావాస కేంద్రంలో పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరావు



నేల వాలిన వరిపైరు పరివీలిస్తున్న ఆనందబాబు

వర్షాలకు నేలవాలుతున్న వరి పైరు

ప్రజాశక్తి - వేమూరు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి వర్షం కారణంగా పంట నేలపాలై రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లో అక్కడక్కడ కోతకు సిద్ధమైన వరి పంట నేల వాలింది. ఈ పైరుపై వర్షపు నీరు నిలబడటంతో గింజ మొలకెత్తడం లేదా కుళ్ళిపోవటం వంటి ప్రమాదం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఏడాది అధిక శాతం రైతులు ఎద పద్ధతిన సాగు చేశారు. వైరు ఏపుగా పెరిగి పంటలు కూడా ఆశాజనకంగా ఉండటంతో ఇప్పటివరకు రైతులు దిగుబడులు ఆశించని మేర వస్తాయనే దృక్పథంలో ఉన్నారు. కాని వర్షాలు ఏకధాటిగా పడుతుండటంతో పరిపక్వ దశకు చేరిన పైరు దుబ్బులో శక్తి లేక వర్షానికి తడిసి బరువెక్కి నేల వాలుతుందని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలకు పైగా నేల వాలి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా కోతల సమయానికి వర్షాలు, తుఫానులు రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆనందబాబు పరిశీలన

శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు మండలంలోని జంపని, బూతుమల్లి, వేమూరు గ్రామాల పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నీట మునిగిన, నేల వాలిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో పంటలు పూర్తిగా నష్టపోయిన పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. పంటల స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు తగ్గిన అనంతరం దెబ్బతిన్న పంటల పరిస్థితిని బట్టి అధికారుల ద్వారా నమోదు చేయించి పరిహారానికి నివేదించనున్నట్లు చెప్పారు.

అస్తవ్యస్త నిర్మాణాలతో నిలిచిన నీళ్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు పంచాయితీలోని రక్షిత నీటి చెరువుపైన నాగుల చెరువుకు ఉత్తరం వైపు డ్రైనేజీ కాల్వ పేరుతో నిర్మించిన కాలువ సామర్థ్యం, నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. దీంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షపు నీరు పొలాల్లో నుంచి పాత ఇడుపులపాడు డొంకలోకి చేరి డ్రైనేజీ కాలువ నిర్మాణం లెవెల్ సరిగా లేకపోవడంతో నీరు బయటకు పోయింది. మిగిలిన నీరు నిర్మాణపు కాలువ ఎత్తు కావటంతో అలానే వరవల్లో నిలబడి ఉంది. శుక్రవారం కురిసిన వర్షానికి కాలువ నిర్మాణ సామర్థ్యం చాలక నీరు వెనక్కు తన్ని పొలాల్లోకి వెళ్లింది. గతేడాది స్థలాల అమ్మకం కోసం వేసిన ప్లాట్లలోకి ప్రవహించింది. ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించిన కాలువ పని వలన ప్రయోజనం లేదని ప్రజలు అంటున్నారు. గతంలో 'ప్రజాశక్తి' అధికారులు, సంబంధిత కాంట్రాక్టరు దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదు. ఎవరి మాట వినకుండా అధికారం బలంతో చేపట్టిన ఈ పని వలన కాంట్రాక్టర్లు, అధికారులకు కాసుల లబ్ధి చేకూరిందే కానీ ప్రజలకు మాత్రం నష్టం కలిగిందని బాధితులు తెలిపారు. ఇంకా అధిక వర్షాలు కురిస్తే ఈ ప్రవాహం పొలాల్లోకి ఇంకా ఎక్కువగా ఉంటుందని అన్నారు.

డ్రైనేజీ నిర్మాణంతో ఇబ్బందులు

ఇంకొల్లులో రూ.60 లక్షల నిధులతో చెరువు అభివృద్ధి పేరిట పనులు కాంట్రాక్టర్లు, అధికారుల ఆధ్వర్యంలో చేశారని గ్రామానికి చెందిన మద్దినేని గోపి తెలిపారు. అందులో రూ.30 లక్షలు అవగాహన రాయిత్యంతో అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్మాణం ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేశారని తెలిపారు. ఈ నిర్మాణంతో పొలాలు, ప్లాట్లలోకి నీరు ప్రవహిస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి గతంలో మాదిరి వర్షపు నీటి ఉరువను ఎప్పటిలా చేసి చెరువులోకి వర్షపు నీరు చేరేలా నిర్మాణం చేయాలని కోరారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం



ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28న జరిగే ప్రజా ఉద్యమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం మోపుతుందని అన్నారు. వైద్య కళాశాల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, చేజర్ల నారాయణరెడ్డి, వైసిపి మండలం అధ్యక్షుడు మరుప్రోలు కొండలరెడ్డి, యువజన జిల్లా అధ్యక్షులు కొక్కి లిగడ్డ చెంచయ్య, వికలాంగులు అధ్యక్షులు చల్లా రామయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, కూనపురెడ్డి అవినాష్ నాయుడు, అడే చందు, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, శాయిల మురళి, తన్నీరు అంకమ్మరావు, నర్రావుల వెంకటరావు, బడుగు ప్రకాష్, కటికల యెహెూషువ పాల్గొన్నారు.

పర్చూరు : వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28 జరిగే వైసిపి 'ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరించారు. వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే వైసిపి ప్రజా ఉద్యమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు, మార్టూరు, చినగంజాం మండలాల వైసిపి అధ్యక్షులు కతారి అప్పారావు, జంపని వీరయ్య చౌదరి, మున్నం నాగేశ్వరరెడ్డి, ముప్పాళ్ళ రాఘవయ్య, కొల్లా శ్రీహరి, దాసరి వెంకటరావు, మువ్వల రాంబాబు, కంచనపల్లి రమేష్, జెట్టి చంద్రం, రామకృష్ణ, బట్టు అనిల్ కుమార్, పులిపాటి అరుణ్ కుమార్, కుమ్మరి చందు, పాదర్తి ప్రకాశ్ పాల్గొన్నారు.

చీరాల : వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా ఉద్యమం పోస్టర్‌ను వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ఆవిష్కరించారు. రామకృష్ణాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలని అన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పర్చూరు వైసిపి నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్ బాబు

చెరువును తలపిస్తున్న పొలాలు



కొల్లూరులో నేల వాలిన పంట పొలాలు

ప్రజాశక్తి - కొల్లూరు

అల్పపీడనం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మాగాణి, మెట్ట పొలాలైన మినుము, పెసర, టమాటలు లోతట్టు పొలాలు నీటిలో మునగడంతో తీవ్రం నష్టం వాటిల్లింది. మాగాని పొలాలైతే వాగులను తలపిస్తున్నాయి. కొన్ని పొలాలైతే ఈపాటికే పొట్ట దశకు వచ్చాయి. అలాంటి పొలాలు నీట మునిగితే గింజలు తప్పేసిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట పొలాలైన మినుము, పెసర, టమాటో పైర్లు నీట మునిగి కుళ్ళిపోతున్నాయి. మొన్నటిదాకా వరదలతో పంటలు నష్టపోయిన రైతులు వాటిని దున్ని మినుము, పెసర, టమాటో పంటలు వేస్తే ఈ వర్షంతో ఈ పైర్లు కూడా నేలపాలు అవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఈపాటికే అప్పులు చేసి రెండు సార్లు పైర్లేస్తే వరదలు, వర్షాలకు పంటలు పూర్తిగా పోవడంతో తిరిగి ఏ పంటలు వెయ్యాలో అర్థం కాని పరిస్థితిలో రైతు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్ట పోయిన పొలాలు నమోదు చేసి పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఇంకొల్లు : గత ఐదారు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయు గుండం ప్రభావాలతో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఖరీఫ్ పంటల సాగుగా పర్చూరులో 1869 ఎకరాలు, ఇంకొల్లులో 550 హెక్టార్లు, కారంచేడులో వరి పంట సాగు మెట్ట పంటలు కలిపి 5437 హెక్టార్లు, యద్దనపూడిలో 631 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. మొత్తం 12,598 హెక్టార్లకు గాను 8487 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, మిరప, మినుము పంటలు సాగయ్యాయని ఎఒ లెక్కలు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా ఇలానే వర్షం కొనసాగితే కండె దశలో ఉన్న మొక్కజొన్నతో పాటు పూత, పిందే, కాయ దశలో ఉన్న పత్తి, ఈపాటికే నాటిన మిరప పంట తోపాటు వరి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

రేపల్లె : అధిక వర్షాల వల్ల ముంపుకు గురైన వరి పొలాలను తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఎఒ ఎ మహేష్ బాబు పరిశీలించారు. మండలంలోని సింగుపాలెం, పోటుమేరక, వడ్డీవారిపాలెం గ్రామాల్లో అధిక వర్షాలకు ముంపుకు గురైన వరి పొలాలు సందర్శించారు.



ఇంకొల్లులో సాగు చేసిన మొక్కజొన్న



వరి పొలాలు పరిశీలిస్తున్న రేపల్లె ఎఒ మహేష్‌బాబు



వరిపైరు పరిశీలిస్తున్న ఎఒ నరేంద్రబాబు

నీట మునిగిన పైర్ల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కొల్లూరు, కాప్ర పరిసర గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటను ఎఒ వి నరేంద్రబాబు శుక్రవారం సందర్శించారు. 178 ఎకరాల్లో వరి పంట నీట మునిగి పడిపోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. కాలువల ద్వారా వరి పంటలో నిల్వ ఉన్న నీటిని బయటికి పంపించుకోవాలని సూచించారు. అధిక వర్షాలతో వరి పంట వివిధ దశల్లో ముంపు గురైనట్లయితే నీటిని పూర్తిగా తీసేసి పై పాటుగా ఒక ఎకరాకు 20కేజీల యూరియా, 10 కిలోల పోటాష్ బూస్టర్ డోసుగా వేసుకోవాలని సూచించారు. నీరు తీయలేని పరిస్థితిలో పైర్లపై 20 గ్రాముల యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేస్తే పైరు త్వరగా పుంజుకుంటుందని తెలిపారు.




మినుమును పరిశీలిస్తున్న ఎఒ సుబ్బారెడ్డి

పంగులూరు : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటను ఎఒ డి సుబ్బారెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కొండమూరులో రైతులు సాగుచేసిన మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో కురిసిన అధిక వర్షాలకు వివిధ గ్రామాల్లో సాగుచేసిన మినుము పంట కోత దశలో ఉండి కాయలు బూజువచ్చి, రంగు మారాయని, మొలక రావటం, పూత రాలిపోవడంతో నష్టం వాటిల్లిందని అన్నారు. ప్రాథమికంగా 2500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు. ఉన్నత అధికారుల అనుమతి వచ్చిన తర్వాత మినుము సాగు చేసిన ప్రతి రైతు పొలాలను పరిశీలించి, ఏమేరకు ఎంత నష్టం జరిగిందో అంచనా వేసి నివేదిస్తామని చెప్పారు. తడిసిన పంటను కాపాడుకునేందుకు వ్యవసాయాదికారులు చేసిన సూచనలు పాటించాలని, అధికారులు సూచించిన మందులు వాడాలని చెప్పారు. ఆయన వెంట విఎఎ మస్తానరావు పాల్గొన్నారు.

టైరు పేలి డివైడర్‌ను ఢీ కొన్న కారు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరం జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. తిరుపతి నుండి విజయవాడ వెళుతున్న స్కార్పియో కారు ఫ్లైఓవర్‌పైకి రాగానే టైరు పగిలి డివైడరును ఢీ కొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం దెబ్బతింది. హైవే అంబులెన్స్ సిబ్బంది ట్రాఫిక్కుకు ఇబ్బంది లేకుండా చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ప్రజాశక్తి
శనివారం 25 అక్టోబర్ 2025



పోతురాజు, వీర్లంకమ్మ విగ్రహప్రతిష్ట దృశ్యం

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ముండ్లమూరు

స్థానిక రజక కాలనీలోని (కన్నెల్ల వంశస్థులు) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతురాజు స్వామి సహిత వీర్ల అంకమ్మ, శ్రీ పోతురాజు కలశ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవం మూడు రోజుల నుండి ప్రారంభమై శుక్రవారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితులైన బ్రహ్మశ్రీ సీతారామ శర్మ ఆధ్వర్యంలో పురోహితులు బ్రహ్మశ్రీ దుర్భాకుల నగేష్ శర్మ బ్రహ్మత్వంన వేద మంత్రోచ్ఛరణల మధ్య విశేషంగా పూజలు సాగాయి. వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజర య్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. పూజల అనంతరం కమిటీ సభ్యులు దుశాల్వాతో డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డిని ఘనంగా సన్మానించారు.

వ్యవసాయ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్‌సిసి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు తొలిసారిగా ఎన్‌సిసిలో ప్రవేశం కల్పించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డిడి స్మిత్ తెలిపారు. తెనాలి 22వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో 22 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎన్‌సిసిలో ప్రవేశం కల్పించేందుకు ఎంపిక చేశారు. తెనాలి డివిజన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉదయ్ కుమార్ బృందం ఆధ్వర్యంలో పరుగు పందెం, వివిధ రకాల ఎంపిక పరీక్షలు నిర్వహించి 13 మంది బాలురు, 9 మంది బాలికలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బి రాజ్ కిరణ్, ఎన్‌సిసి ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

ప్రజాశక్తి - కారంచేడు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి వాగుల ఉధృతి కొనసాగుతుంది. మండలంలోని తిమ్మిడితపాడుకు వెళ్లే రోడ్డు శుక్రవారం కూడా పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రంగప్పనాయుడు వారిపాలెం నుంచి కేశవరప్పాడుకు వెళ్లే దిగువ చట్ట పూర్తిగా నీటితో మునిగిపోయింది. కప్పల వాగుపై వరద ఉధృతి కొనసాగుతుంది. పంచాయతీ అధికారులు ఆ ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాలు, ప్రజల రాక పోకలను నియంత్రిస్తున్నారు. స్వర్ణ సచివాలయం వెనుక ప్రాంతం 50 ఎకరాల పైగా వరద నీటితో మునిగిపోయి చెరువును తలపిస్తుంది. ఎటువంటి పంటలు వేయకపోవడంతో రైతులకు నష్టం ఏర్పడలేదు. వరద ఉధృతితో అంతరాయం లేకుండా తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఒ నేతాజీ పర్యవేక్షిస్తున్నారు.

గుర్రపు డెక్క తొలగించాలి

ప్రజాశక్తి - బాపట్ల

వాయు గుండం ప్రభావంతో అకాల వర్షాలకు వరి పొలాల్లో చేరిన వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కంకటపాలెం, జమ్ములపాలెం, మూలపాలెం గ్రామాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు పంట పొలాలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో చేరిన వర్షం నీరు మురుగునీటి కాలువల ద్వారా బయటకు వెళ్లేందుకు కాలవల్లో తూటి కాడ, గుర్రపు డెక్క తీవ్ర అవరోధంగా మారింది. అయితే నాణ్యత లేని పనులు చేయటంతో ఈ పరిస్థితి ఎదురైందని రైతులు చెప్తున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. వర్షపాతం పెరిగి, ఇదే పరిస్థితి కొనసాగితే వరి ఈనే దశకు వచ్చిన తరుణంలో వరి పంట తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొలాల్లో మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క వెంటనే తొలగించకపోతే వర్షం నీరు బయటకు వచ్చే అవకాశం లేదని రైతులు అంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించి వరి పైరును వరద ముంపు నుండి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రూ.60 లక్షల అవినీతిపై సర్పంచ్‌కి నోటీసు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతిలో జరిగిన ప్రజాధనం దుర్వినియోగంలో ప్రస్తుత సర్పంచ్ దారా రవికిరణ్మయి వాటాగా రూ.60లక్షలు నిగ్గు తేల్చి, దానిని తిరిగి చెల్లించాలని సర్పంచ్‌కు డిపిఒ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ ఎంపిడిఒ విజయబాబు స్వయంగా సర్పంచ్‌కి అందచేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో భట్టిప్రోలు పంచాయతి నందు జరిగిన రూ.2.30 కోట్ల అవినీతిపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సంబంధిత ఆధారాలతో కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులు విచారణ చేసి రూ1.80 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు, అందులో 2021 నుండి 2024 వరకు మూడేళ్లలో సర్పంచ్ అవినీతి వాటా రూ.60,09,386 నిర్ధారణ చేసి, సదరు డబ్బు తిరిగి రాబట్టేందుకు, ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లు తేలినందున పిఆర్ చట్టాన్ని అనుసరించి సర్పంచ్ దారా రవికిరణ్మయిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో కోరుతూ 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఈ నెల 21న నోటీసు జారీ చేశారు. సంజాయిషీ సహేతుకంగా లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డిప్యూటి ఎంపిడిఒ విజయ బాబు మాట్లాడుతూ భట్టిప్రోలు సర్పంచ్‌కు డిపిఒ నుండి షోకాజ్ నోటీసు వచ్చిన మాట నిజమేనని, నిబంధనల మేరకు సర్పంచ్‌కు అందచేసినట్లు తెలిపారు. పంచాయతీలో రూ.1.80 కోట్లు ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు అధికారుల బృందం విచారణలో తేలగా ఈ అవినీతిలో పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో రూ.1.20 కోట్లు అవినీతి జరిగినట్లుగా తెలుస్తున్నది. ఈ అవినీతిలో ఈపాటికే నలుగురు అధికారులు సస్పెండ్ కాగా, షోకాజ్ నోటీసుల జారీ చేయడం ద్వారా సర్పంచిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. మరికొద్ది నెలల్లో రానున్న పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీలో జరిగిన అవినీతి ప్రభావం కనిపిస్తుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు తిప్పలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు, కుందుర్రు గ్రామాల్లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చు కోవడంతో ఆ బ్యాంకు ఖాతాదారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. సప్తగిరి, చైతన్య గోదావరి, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంకులతో విలీనం కావడంతో ఈ మార్పు జరిగింది. ఈ బ్యాంకు దాదాపు 15 రోజులుగా ఖాతాదారులకు సేవలు అందించక పోగా వారి విలువైన సమయం, దినసరి ఆదాయానికి గండి కొట్టారు. ఈ బ్యాంకుకు సంబంధించి 15 వేల మంది ఖాతాదారులు, వెయ్యికి పైగా డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. సర్వర్ ప్రాబ్లంతో విత్ డ్రాయల్స్‌కు వాయిదాలు వేస్తున్నారు. ఒక్క ఎటిఎం సేవలు మినహా అన్ని పునరిద్ధరిస్తున్నామని ఈనెల 13న ప్రకటించారు. అప్పుడు ఊపిరి పీల్చుకున్న ఖాతాదారులు బ్యాంకుకు వెళితే వారికి పట్ట పగలే చుక్కలు చూపిస్తున్నారు. ఈ బ్యాంకులో ప్రతి ఐదు నిమిషాలకు సర్వర్ మోరాయిస్తుంది. దీంతో ఖాతాదారులు కాళ్లు వాచేలా గంటల తరబడి కౌంటర్ల వద్ద నిలుచునే పరిస్థితి దాపురించింది. ఒక ఆర్థిక వ్యవహారం పూర్తి చేసుకునేందుకు రోజులు తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందు కోసం ఆర్థిక వ్యయాన్ని, విలువైన సమయాన్ని బ్యాంకు సిబ్బంది అసమర్థతకు ఖాతాదారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. నిత్యం వడ్డీతో కూడిన రుణం చెల్లించే డాక్రా గ్రూపులు నిర్ణీత సమయంలో ఋణం చెల్లింపునకు వెళ్లినా, వీరితో బ్యాంకర్లు లావాదేవీలు జరపడం లేదు. రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. గడువు దాటితే వేసే అధిక వడ్డీని ఎవరు బరాయించాలని ప్రశ్నిస్తున్నారు. ఇదే కాదు ఖాతాదారుల డిమాండ్ ఆధారంగా చేయాల్సిన విత్ డ్రాయల్స్ సైతం సర్వర్ మొరాయింపుతో నిలిపి వేస్తున్నారు. బ్యాంకుకు సంబంధించి రూ.కోట్ల టర్న్ వర్ ఇస్తున్న గ్రామీణ ఖాతాదారులే కనుక అలాంటప్పుడు గడువు తీరిన వడ్డీలో బ్యాంకు మినహాయిస్తుందా? లేక తన అసమర్థతను ఆర్బిఐకి తెలియకుండా ఖాతాదారులను ఇబ్బందులు పెట్టే పరిస్థితులు కనబడుతున్నాయి.

పోలియో నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పంగులూరు

అంతర్జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నివారించేందుకు రోటరీ క్లబ్బు కృషి చేస్తుందని అన్నారు. భారత దేశంలో పోలియో పూర్తిగా నిర్మూలించేందుకు రోటరీ క్లబ్ విశేషమైన కృషి చేసిందని చేసిందని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ సేవా రంగంలో రోటరీ క్లబ్ పాత్ర ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని అన్నారు. మండలంలో క్లబ్బు సేవలు అందిస్తుందని అన్నారు. అవి పేద వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని అన్నారు. పోలియో రాకుండా ముందుచూపుగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అనంతరం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి షేక్ కాలేషావలి, క్యాంప్ ఇంచార్జి చిలుకూరి వీరరాఘవయ్య, చిలుకూరి ప్రసాద్ నాయుడు, గుర్రం ఆంజనేయులు, రసిపిఎం కార్యదర్శి తలపనేని రామారావు, ఎఎన్ఎం ఎస్తేరు రాణి, అంజమ్మ, జె సంధ్య, సిహెచ్ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

పర్చూరు : పోలియో రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ అన్నారు. ప్రపంచ పోలియో రహిత దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొమ్మల సెంటర్లో మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి, దండ్రులు పిల్లలు పుట్టిన వెంటనే పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు,



పంగులూరులో పల్స్ పోలియో నిర్వహిస్తున్న దృశ్యం

ఎజి నాగభైరు శ్రీనివాసరావు, కోట హరి ప్రసాదరావు, పాబోలు ఉదయభాస్కర్, కెఎస్ఆర్‌కె ప్రసాద్, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రశేఖరరావు, మున్నంగి వెంకటసుబ్బయ్య, కారుమూడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు, అంబేద్కర్, ఆంధ్ర కేసరి విగ్రహాల మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, చుండూరి మురళీ సుధాకరరావు, అద్దంకి లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య, పసుపులేటి ఆంజనేయులు, సంధిరెడ్డి శ్రీనివాసరావు, దివాకరదత్తు, చిన్ని కామేశ్వరరావు, గూడా లక్ష్మీరెడ్డి, డాక్టర్ ఖాజావలి, అంజాద్ భాషా, శివయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : అంతర్జాతీయ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పోలియో రహిత సమాజానికి కృషి చేయాలని నినాదాలు చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి పాల్గొన్నారు.



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఏలూరి సాంబశివరావు

అభివృద్ధిపై బుక్‌లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని నాయుడు వారిపాలెం పంచాయతీలో నాలుగేళ్ల అభివృద్ధిపై పంచాయతీ సెక్రటరీ వై వినయ్ పాల్ తయారు చేసిన పుస్తకాన్ని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శుక్రవారం నాడు తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పంచాయతీలను బలోపేతం చేస్తూ అనేక పాలనాపరమైన సంస్కరణలు తీసుకోని వస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తున్నదని, వాటి ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. నాయుడువారి పాలెంలో గడిచిన నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి పంచాయతీ సెక్రటరీ వై వినయ్ పాల్ రూపొందించిన బుక్‌లెట్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి సీతమహాలక్ష్మి, రాంమోహన్, టిడిపి మండల అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీహరి, పోతినవారి పాలెం సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, ఇంకొల్లు టిడిపి అధ్యక్షులు నాయుడు హనుమంతురావు, చింతగుంపల సొసైటీ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, కొడవలివరి పాలెం నాయకులు కొసరాజు సురేంద్ర పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని పొన్నపల్లిలో వేంచేసియున్న శ్రీ సత్య ప్రసూనాంబ సమేత సోమేశ్వరస్వామి దేవాలయ పునఃనిర్మాణం సమయంలో అవకతవకలు జరిగాయని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పొన్నపల్లి నాగమణి ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 23న దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విచారణ చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ అనుమతుల మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్, వారి బృందం నిజ నిర్ధారణకు పొన్నపల్లి సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రజాసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ ప్రజా సభకు ఆరోపణలు ఎదుర్కుంటున్న చావలి శ్రీధర శర్మ, అన్నదానం సత్యనారాయణ, కారంచేతి శివరాం శర్మ, మల్లెల కృష్ణ మూర్తి ప్రేరణతో కొందరు ప్రజాసభకు హాజరై సభను రసాభాస చేయుటం, నిజ నిర్ధారణకు అర్జీలు పెట్టుకున్న చర్ల నాగమణి, పొన్నపల్లి విద్య భాస్కర్ అను మాపైన, సమాచార స్వీకరణకు విచ్చేసిన మీడియా మిత్రునిపై మా కెమెరామేన్లపై దాడి చేసి గలాటా సృష్టించారు. కార్యక్రమంలో అన్నదానం కామేశ్వరి, మల్లెల కృష్ణమూర్తి, సామ్యూల్ రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

విఠలేశ్వర కాలనీలో నీటి మళ్లింపు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులోని విఠలేశ్వర కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పంచాయతీ అధికారులు సిబ్బందితో వెల్లటూరు ఛానల్ కాలువలోకి మళ్ళించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు గ్రామంలోని ఇతర ప్రాంతాలు నీట మునిగాయి. వీటిలో విఠలేశ్వర కాలనీలో నీరు ఎటూ వెళ్ళే మార్గం లేక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. దీంతో పంచాయతీ కార్యదర్శి మాఝీ నాయక్ సిబ్బందితో కలిసి పక్కనే ఉన్న వెల్లటూరు ఛానల్‌కు మళ్ళించారు. వర్షాల కారణంగా ఈ ఛానల్‌కు సాగునీటిని నిలిపివేశారు. దీంతో కాలనీలోని నీటిని తూముల ద్వారా కాలువలోకి మళ్ళించి నట్లు తెలిపారు.



నీటిని బయటకు మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

27 నుంచి భారీ వర్షాలు

- పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో ఈ నెల 27 నుంచి మరోమారు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులందరూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా లో వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువులు,రోడ్లు, వాగులు వంటి అంశాలపై డిఆర్ఓ, ఆర్టీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, మండల తహశీల్దార్లు, ఎంపీడీఓల తో వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరో మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులందరు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టా లన్నారు. మండల వ్యవసాయ అధికారులు వారి పరిధిలో ఉన్న రైతులతో మాట్లాడి పొలాల్లో నిలిచి ఉన్న నీటిని తొలిగించే ఏర్పాట్లు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఇంచార్జి డిఆర్ఓ ని, కమాండింగ్ కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్ట్ గా డ్యూటీలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఏమైనా ఎమర్జెన్సీ ఉంటే కలెక్టర్‌కి ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. నలుగురు మున్సిపల్ కమిషనర్లు 25 మంది ఎంపీడీవోలు ప్రతిరోజు వారి పరిధిలో పర్యటించి చేపట్టిన పనులకు సంబంధించి ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

6935.36 హెక్టార్లలో

పంటలు నీటి పాలు

- 131.20 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
- వర్షాలతో పొలాలలో నిలిచిన నీరు
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రాథమిక అంచనాలు పంపిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలతో 6935.36 హెక్టార్లలో రైతులు సాగు చేసిన వివిధ పంటలు నీటమునిగాయి. అదేవిధంగా ఉద్యాన పంటలు మిర్చి, కూరగాయలు, పూల తోటలలోకి నీరు చేరటంతో 131.30 హెక్టార్లలలో మొక్కలు వడలిపోయాయి. ఇదే విధంగా వర్షాలు కొనసాగితే వ్యవసాయ పంటలు ఉరకలెత్తే అవకాశాలు ఉన్నాయి. వర్షాలతో పంట పొలాలలో నీరు నిల్వ ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో పంటల నష్టాలపై జిల్లా అధికారులు ప్రాథమిక అంచనాలు ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపించారు.



పొదిలి మండలం, మాదాలవారిపాలెంలో వర్షం వల్ల దెబ్బతిని మొలక వచ్చిన సజ్జ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

జిల్లాలో అకాల వర్షంతో రైతులు వేసి పంటలు నీట మునిగాయి. ఆరుగాలం కష్టించిన రైతు కష్టం నీటిపాలైంది. భారీ వర్షాలతో 6935.36 హెక్టార్లలలో పంటలు నీటమునిగాయి. పత్తి, సజ్జ పంటలు ఎక్కువగా నీట మునిగాయి. ఇందులో జొన్న 5.42 హెక్టార్లు, సజ్జ 1553.98 హెక్టార్లు, మొక్క జొన్న 102.06 హెక్టార్లు, పత్తి 5179.4 హెక్టార్లు, వేరుశనగ 94.50 హెక్టార్ల పంట నీట మునిగింది. జిల్లాలోని 15 మండలాలలోని 140 గ్రామాలలో 8428 మంది రైతులు నష్టపోయారు. భారీ వర్షాలతో ప్రధానంగా పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు, మర్రిపూడి, పొదిలి, కొనకనమిట్ల, దొనకొండ, కురిచేడు, రాచర్ల, గిద్దలూరు, బేస్తవారపేట, పుల్లల చెరువు, యర్రగొండపాలెం, వెలిగండ్ల మండలాలలోని రైతులకు నష్టం వాటిల్లింది. మార్కాపురం మండలంలో అత్యధికంగా 3260 మంది రైతులు, వెలిగండ్లలో 1013 మంది రైతులు, రాచర్ల మండలంలో 425 మంది రైతులు నష్టపోయారు. ఆయా మండలాలలో జరిగిన పంట నష్టాలపై ప్రాథమిక అంచనాలను జిల్లా వ్యవసాయ అధికారులు కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

ఉద్యాన పంటలకు నష్టం

భారీ వర్షాలతో ఉద్యాన పంటలకు నష్ట వాటిల్లింది. మొత్తం 131.20 హెక్టార్లల్లో మిర్చి కూరగాయలు, పూల తోటలకు నష్టం వాటిల్లింది. 9 మండలాలలోని 15 గ్రామాలలో 180 మంది రైతులు నష్టపోయారు. మిర్చి 70 హెక్టార్లు, కూరగాయలు 60 హెక్టార్లు, పూలతోటలు 1.20 హెక్టార్లలలో వర్షపు నీరు నిలిచిపోవటంతో మొక్కలు వడలిపోయాయి. ఉద్యాన రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ధాత్రి మృతితో

పూసపాడు, పూనూరు గ్రామాల్లో విషాదం

ప్రజాశక్తి-ఇంకొల్లు, యద్దనపూడి

కర్నూలులో బస్సు ప్రమాద దుర్ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గన్నమనేని ధాత్రి (27) మృతిచెందడంతో ఇంకొల్లు మండలం పూసపాడులో, యద్దనపూడి మండలం, పూనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ధాత్రి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆమె మేనమామ గంటా శ్రీధర్ ఇంటి వద్ద నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ బస్సు ప్రమాదంలో మృతిచెందింది. ధాత్రి వారి కుటుంబం స్వగ్రామం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామం. తండ్రి గన్నమనేని భానుప్రసాద్, తల్లి వాణి. నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో తండ్రి భానుప్రసాద్ మరణించాడు. వీరి కుటుంబానికి ధాత్రి ఒక్కగానొక్క అమ్మాయి. అమ్మమ్మ గ్రామమైన ఇంకొల్లు మండలంలోని పూసపాడులో తల్లి వాణి, ధాత్రి నివాసం ఉంటున్నారు. ఉన్నత చదువులు చదివిన ధాత్రికి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అక్కడ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మేనమామ ఘంటా శ్రీధర్ ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రైవేట్ బస్సులో ప్రయాణిస్తుండగా కర్నూలులో జరిగిన ప్రమాదంలో మృతిచెందింది. దీంతో పూసపాడు గ్రామంతో పాటు పూనూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం ఉదయం బంధువులు తల్లి వాణితో కలిసి కర్నూలు ఆస్పత్రిలో ఉన్న ధాత్రి భౌతికకాయం కోసం తరలివెళ్లారు.

పూనూరు గ్రామానికి చెందిన సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ ధాత్రి చిన్నప్పటి నుండి చురుకైన అమ్మాయి అని, ఈ అమ్మాయి వారికి ఒక్కతే కావడంతో చదువు కోసం వాళ్ల నాన్న చాలా శ్రద్ధ చూపాడని గుర్తుచేశారు. ధాత్రి పెద్ద నాన్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో విజయవాడలో పని చేస్తున్నాడని చెప్పారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

బస్సు' దుర్ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

బస్సు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సజీవ దహనమై ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ప్రమాదంలో ధాత్రి (27) మతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల

సమస్యలను పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విభిన్న ప్రతిభావంతులు, గిరిజనుల సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ లో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా లతో కలిసి విభిన్న ప్రతిభావంతులు, గిరిజనుల సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల ను పరిశీలించి వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులు గిరిజనుల కోసం ప్రతి నెల 4 వ శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని,హాజరు కానీ అధికారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి కొన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కాకపోవడంతో గిరిజన సంక్షేమ సాధికారత అధికారి బి ప్రకాష్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ అధికారిణిని సువార్తల పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డియం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయమ్మ,డిపిఓ ప్రభాకర్ రావు, డ్వామా పి డి.విజయలక్ష్మి, సిపిఓ షాలెమ్ రాజు, ఇంచార్జి డిఆర్డీఏ పీడి లవన్న,జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ పీడి రాధా మాధవి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం

- డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదు..
- ఎస్పీ ఉమామహేశ్వర్



మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదని తెలియని లింకులను క్లిక్ చేసి మోసపోవద్దని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జాతీయ సైబర్ నేరాల భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, వాటి పర్యవసానాలు, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అతి సరళంగా అర్థమయ్యే విధంగా విస్తత స్థాయి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా జిల్లా ఎస్పీ మూడు సూత్రాలతో కూడిన గోల్డెన్ రూల్‌ను ప్రతిపాదించారు. క్లిక్ చేసే ముందు ఆలోచించాలని, షేర్ చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారం జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ గోల్డెన్ రూల్స్‌ను పాటించడం వల్ల మీరు మీ వ్యక్తిగత సమాచారం, మీ విలువైన నగదును జాగ్రత్తగా ఉంచుకొని సైబర్ నేరస్తుల వలకు మీరు ఎరగా మారకుండా ఉంటారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపట్ల, సైబర్ నేరస్తుల వ్యవహార శైలి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరస్థులు సాంప్రదాయ నేరాల నుండి సాంకేతిక నేరాల వైపు మారారని, ప్రస్తుత నూతన సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్ మన జీవనశైలి భాగమైపోవడంతో దాని ఉపయోగం విరివిగా పెరిగిందని, దీనిని అదునుగా చూసుకున్న సైబర్ నేరస్తులు అనేక మందిని తమ వలలో వేసుకొని వారి నేరవత్తి కొనసాగిస్తున్నారని తెలిపారు. వీరిలో బాధితులు అనేకమంది విద్యావంతులు, టెక్నాలజీ గురించి తెలిసిన వారే ఉండటం బాధాకరమన్నారు. సైబర్ నేరం జరిగిన గంటలో 1930కు ఫోన్ చేయడం వలన ఫలితం ఉంటుందని, అంతకంటే ఆ సైబర్ నేరగాడి వలలో పడకుండా అవగాహన కలిగి ఉండడం మంచిదన్నారు. సైబర్ నేరాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్న డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదని అది కేవలం కల్పితం మాత్రమేనని, సైబర్ నేరగాళ్లు అనేక పేర్లతో ప్రజల్ని భయపెట్టడానికి చూస్తారని ప్రజలు ఎవరు భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు. తెలియని వ్యక్తుల నుండి లేదా సంస్థ నుండి వచ్చే లింకులను క్లిక్ చేసి మీ వ్యక్తిగత సమాచారాన్ని, డబ్బును కోల్పోకోవద్దని, అపరిచితులకు ఓటీపీ వివరాలు, పాస్వర్డ్ చెప్పొద్దని, మీ సమాచారాన్ని నిక్షిప్తం చేసేటప్పుడు బలమైన పాస్‌వర్డ్‌ను, రెండు అంచెల భద్రత ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థినుల చేత ఆన్లైన్లో సైబర్ నేరాలపై అవగాహనకు సంబంధించిన ప్రతిజ్ఞను చేపించి, ఈ ప్రతిజ్ఞలో భాగమైన విద్యార్థులకు బాపట్ల పోలీస్ విభాగం ద్వారా సర్టిఫికెట్లు కూడా జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎస్పీతో పాటు బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ డి. వెంకయ్య చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు, బాపట్ల డి.ఎస్.పి రామాంజనేయులు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ రాంబాబు, సైబర్ క్రైమ్ సెల్ ఆర్.ఐ టి. శ్రీకాంత్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలియోను అంతం చేద్దాం..

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి సంవత్సరం అక్టోబర్ 24 వ తేదీని ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవంగా జరుపుతున్నారని, ఈ సంవత్సరం “పోలియోను అంతం చేయండి. ప్రతి బిడ్డ, ప్రతి టీకా, ప్రతి చోట అనే థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా పోలియోను అంతం చేయడానికి ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ప్రపంచంలో పోలియో టీకాను మొదటగా కనుగొని అభివద్ధి చేసిన శాస్త్రవేత్త జోనస్సాల్క్ జ్ఞాపకార్థం దీనిని రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ 1985లో ప్రపంచ పోలియో దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పోలియో వ్యాక్సిన్ ఐదు సంవత్సరముల లోపు పిల్లలు అందరికీ వేయించాల్సిన ఆవశ్యకత గురించి జిల్లా అధికారులకు వివరించారు. రాష్ట్రంలో 2008 తర్వాత పోలియో కేసులు నమోదు కాలేదని అలాగే 2014 నుంచి భారత దేశంలో ఒక్క పోలియో కేసు కూడా రానందువలన పోలియో రహిత భారత దేశంగా ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మావతి,జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబి నివారణ అధికారి డాక్టర్ వి.సోమ్లా నాయక్ , ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.